# ఉప్పు నీళ్ళు

నలుగురితోపాటు తనూ కలిసి నడుస్తున్నా తన కులం తనని వాళ్ళ నుంచి కొన్ని యోజనాల దూరంలో నిలబెట్టింది. ఆమెకి మిగిలింది ఒంటరితనమేనా?

కొత్త అడవిలో కాలుమోపిన లేడిలా.... ఆ అమ్మాయి.... పాదాలు వణుకుతున్నాయి.... కళ్ళు బెదురుతూ అటు యిటు చూశాయి—

"ఈ కాలేజీలో కొత్తగా చేరావా?" ఎవరో అడిగారు.

అవునన్నట్లు తలూపింది.

"పేరు?"

"కమల...."

"ఏ క్లాసు?"

"నాదాండి.... సెకండ్ క్లాసు"

గొల్లున నవ్వులు.

ఆ అమ్మాయి ఇంకా బెదిరిపోయింది. అసలే చాలా సేపట్నుంచి దాహంగా ఉందేమో.... ఈ నవ్వులు గొల్లుమనేసరికి గొంతు తడారిపోయింది.

"పరికిణీ ఓణీ వేసుకొని డిగ్రీ కాలేజీలో సెకండ్ క్లాసు చదవడాని కొచ్చావా?"

"కాదండి.... ఇంటర్మీడియట్‌లో నాది సెకండ్ క్లాసు" తడబడుతూ చెప్పింది....

"అలాగా.... సెకండ్ క్లాసు మా కాలేజీలో కొత్తగా పెట్టారేమో- అందులో చేరావనుకున్నాము."

"అబ్బే లేదండి...."

"మరి నీదేక్లాసు?"

"బి.కాం ఫస్టియర్...." ఈసారి సరిగ్గా చెప్పగలిగినందుకు తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది కమల.

"మీడియం తెలుగా? ఇంగ్లీషా?

"తెలుగు మీడియమా-లతా మీట్ దిస్ గర్ల్-మీ కమ్యూనిటీ" అంది మరో అమ్మాయి- ఆమె పేరు లీలా శ్రీనివాసన్.

"మా కమ్యూనిటి ఏవిటే?"

"అదే కామర్స్ తెలుగు...."

"వాణిజ్య శాస్త్రం అనవే...."

"అంత పొడుగు నేనన్లేనుబాబు.... ఇదిగో ఈ అమ్మాయి ఫ్రెషర్....మీ కామర్స్ తెలుగు మీడియం. పాపం కాస్త క్లాస్‌రూం చూపించు—" అంది లీలా శ్రీనివాసన్.

ఆ అమ్మాయి హిందూను హిండూ అంటుంది. తెలుగును తెలుగుఅంటుంది తన మాతృభాష టామిల్ అంటుంది.

లత మరో ఇద్దరు ముగ్గురు అమ్మాయిలను, అబ్బాయిలను పరిచయం చేసింది.

అందరికీ వినయంగా చేతులు జోడించి నమస్కరించింది కమల.

వాళ్ళు తననంతగా ఎందుకు ఆదరంగా పలకరించి పరిచయాలు చేసుకుంటున్నారో కాలేజీ ఎలక్షన్లు వస్తేగాని కమలకు అర్థం కాదు–

లత బి.కాం సెకండియర్ తెలుగు మీడియం.... ఆ అమ్మాయి కమలను ఫస్టియర్ క్లాసు గదివైపుకు తీసుకుపోతున్నది.

"చూడండి ..." అంది కమల ఆగుతూ.

ఆ అమ్మాయి వెనక్కు తిరిగి చూసింది.

"దాహంగా ఉందండి...." అంది కమల మెల్లగా.

"ఆ'గో ఆ మూలకు వాటర్‌కూలర్ ఉంది. చల్లని నీళ్ళు తాగొచ్చు రండి.

కమలను వాటర్ కూలర్ పంపు దగ్గరికి తీసుకుపోయింది లత.

దేశంలోని పేదరికానికి మనుషులమీద అపనమ్మకానికి గుర్తుగా అక్కడ రంగు వెలసిన రెండు ప్లాస్టిక్ గ్లాసులున్నాయి.

వంగి దోసిలితో నీళ్ళు తాగడానికి వీలుగా లేదు– గీతలు పడి, రోత రంగులోకి దిగి– వాసనతో నేస్తం చేసే ప్లాస్టిక్ గ్లాసుతో నీళ్ళు తాగాల్సిందే.

ఆ వాటర్ కూలర్‌ను బహదూర్ ఆదిరెడ్డిగారు తమ తల్లిగారి పేర విద్యార్థుల కోసం దానం చేశారని పెద్ద పెద్ద అక్షరాలను మోసే బోర్డొకటి ఉంది.

నీళ్ళు త్రాగేవాళ్ళంతా చదువుకోడానికి వీలుగా ఆ బోర్డ్ ట్యాప్‌లమీదనే అమర్చబడింది.

అద్దాలున్నవాళ్ళు, లేనివాళ్ళుకూడా సులభంగా చదువుకోడానికి వీలుగా బోర్డుకు తెలుపు రంగు, అక్షరాలకు నలుపు రంగు వేయబడింది.

ఆ మహానుభావుడు ఆదిరెడ్డి—దాహార్తులకు చల్లని నీళ్ళు సప్లయి చేస్తున్న త్యాగమూర్తి. వాటర్ కూలర్‌తోపాటు ఒకటో రెండో లోహపు గ్లాసులుకూడా సప్లయి చేసే ఉంటాడు. అవి ఏ ఇంటి నీటిని మోయడానికో మాయమై వాటర్ కూలర్ మాత్రం బహదూర్ ఆదిరెడ్డి తల్లిగారి పేరును మోస్తూ అలాగే నిలిచిఉంది.

కమలకు గొంతులో నీళ్ళు దిగగానే ఇంకిపోతున్న ప్రాణాలు బలం పుంజుకున్నట్టు అనిపించింది.

లత చూపించిన క్లాసులోకి వెళ్ళి కూర్చుంది.

మెడకు బిగుతైన టై, కాళ్ళకు ఎత్తయిన షూస్ తొడుక్కున్న ఓ కుర్ర లెక్చరర్ ఇంగ్లీషులో కాస్సేపు తెలుగులో కాస్సేపు లెక్చరిస్తున్నాడు. తాను ఎకౌంట్స్ చెప్పబోతున్నట్టు పదే పదే ఎనౌన్స్ చేస్తున్నాడు. ఎలాంటి నోట్ బుక్స్ కొనుక్కోవాలో, ఏ ఎకౌంట్స్ పుస్తకాలు కొనుక్కోవాలో.... అకాడమీ తెలుగు పుస్తకాలతోపాటు ఇంగ్లీషు పుస్తకాలు చదవడం ఎంత అవసరమో నొక్కి చెప్తున్నాడు.

మంచి మార్కులు రావాలంటే తప్పుల తడకలైన అకాడమీ టెక్స్ట్ బుక్స్ చదివి లాభంలేదని ఏ సబ్జక్టులోనైనా ఇంగ్లీషు పుస్తకాలుకూడా చదివి తీరాలని కొన్ని తెలుగు ఇంగ్లీషు పుస్తకాల పేర్లు బోర్డుమీద రాశాడు.

కమల ఆ పుస్తకాల పేర్లు శ్రద్ధగా నోట్ చేసుకుంది. ఆ క్లాసులో అమ్మాయిలు గోడ పక్కన బెంచీలమీద కూర్చుంటే అబ్బాయిలు ముందు బెంచీలను దుమ్ముకు వొదిలేసి వెనక బెంచీల్లో కూర్చున్నారు.

వారం రోజులదాకా అలా పరిచయాలు, పుస్తకాల విషయాలు సిలబస్ డిక్టేషన్లు జరుగుతూనే ఉన్నాయి.

ఈ వారం రోజుల్లో కమలకు వినతి, జానకిలతోపాటు సెకండియర్ లతతో కూడా స్నేహం పెరిగింది.

అటెండెన్స్‌తోపాటు పాఠాలు ప్రారంభమైనాయి.

ఒకరోజు ఇంగ్లీషు మేడం టెక్స్ట్ పుస్తకాలు లేని పిల్లలమీద కేకలేసింది. ప్రిన్సిపాల్ గారికి ఆమె బంధువట. సెకండియర్ స్టూడెంట్స్‌కే ఆమెను చూస్తే భయం. ఇక ఫ్రెషర్స్‌ను ఆమె ఎంతగా హడలగొడుతుందో ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు.

మరోరోజు టెక్స్ట్ పుస్తకాలు లేని పిల్లలను లేచి నిల్చోమంది. నిల్చున్న వాళ్ళలో కమల కూడా వుంది.

అబ్బాయిలను షూస్, డ్రెస్‌లు అమ్ముకొని టెక్స్ట్ కొనుక్కొమ్మంది ఇంగ్లీషు మేడం. అమ్మాయిలకు మాత్రం కన్సెషన్ ఇస్తూ రోజూ ఒకపూట తిండి మానేసి పుస్తకాలు కొనుక్కొమ్మంది. అంతా ముప్పొద్దులా భోంచేస్తారని ఆమె గట్టి నమ్మకం.

కమల ఆలోచిస్తోంది. కాలేజీలో చేరేముందు తన దుస్తుల కోసం నాన్న అప్పు చేయడం ఆమెకు తెలుసు. పుస్తకాలకోసం మళ్ళీ నాన్నతో అప్పు చేయించడం ఆమెకు బాధగా వుంది. రెండు నెలలుపోతే ఆ అప్పు కొంత తీరుతుంది. కొత్త అప్పుతో పుస్తకాలు కొనుక్కోవచ్చు అప్పటిదాకా ఎలాగో సర్దుకోవాలి.

క్లాసులో పాఠాలు శ్రద్ధగా వింటూ, పాయింట్స్ నోట్ చేసుకుంటూ వీలయినప్పుడు పుస్తకాలు కొనుక్కుంటుంది కమల. ఇలాంటి అడ్జస్ట్‌మెంట్స్ అంటే ఇంగ్లీషు మీడంకు చిరాకు.

* * *

ఒకరోజు బస్సులో లత కనిపించింది కమలకు.

"మీరు రోజూ ఈ స్టాఫ్‌లోనే బస్సు ఎక్కుతారా?" అని అడిగింది.

అవునన్నట్లు తలూపింది కమల.

"ఇక్కడికి దగ్గరేనా మీ యిల్లు!"

"అదిగో ఆ కాలనీ...." అని చూపించింది.

"ఆ కాలనీనా....! అది హరిజన కాలనీకదూ!"

అవునన్నట్లు తలూపింది కమల.

బస్సులో కూర్చున్న నలుగురైదుగురు వాళ్ళ కాలేజీ అమ్మాయిలు ఆ మాట విని కమలవంక చూశారు.

నిల్చున్న గల్లా షర్టులు చూశాయి.

ఇబ్బందిగా తల దించుకుంది కమల.

ఆ మధ్యాహ్నం లంచవర్‌లో లాన్‌లో కూర్చుని నోట్స్ చదువు కుంటున్నది.

దూరంగా ఎవరితోనో మాట్లాడుతూ వినతి నిల్చుంది. లత అక్కడికి వచ్చి వినతిని చూసి "ఏయ్ మీ క్లాస్‌మేట్ కమల హరిజనట ..." అంది.

ఇంటర్‌లో తనకు ఇద్దరు హరిజన అమ్మాయిలతో స్నేహం వుండేదని, రోజూ వాళ్ళతో చేతులు కలిపి షేక్‌హాండ్ తీసుకునేదానినని, ఒకే బెంచిలో కూర్చునేవారిమని, లంచ్‌లో కలిసి భోంచేసేవారిమని వినతి గొప్పగా లతకు చెబుతోంది

కమలతో స్నేహంగా వుండు. హరిజన స్టూడెంట్స్ ఓట్లన్నీ నీకే పడతాయి అని కూడా సలహా ఇచ్చింది.

వచ్చే స్టూడెంట్స్ యూనియన్ ఎలెక్షన్లలో లత జనరల్ సెక్రటరీ పదవికి పోటీ చేయబోతున్నది.

వాళ్ళ సంభాషణ కమలకు వినబడుతున్నది. నోట్ బుక్‌లోని అక్షరాల ఆకారాలు మారుతున్నాయి.

తమ క్లాస్‌మేట్ కిశోర్ కూడా వాళ్ళ సంభాషణలో చేరాడు.

కొంత సేపటికి వాళ్ళ దృష్టి కమల మీద పడి దగ్గరకొచ్చారు. వినతి, లత ఎంతో అభిమానంగా కమలను తాకుతూ కూర్చున్నారు.

మాటిమాటికి కమల భుజం మీద చేయివేసి మాట్లాడుతున్నది లత - కమలకు ముళ్ళ మీద కూర్చున్నట్టుగా వుంది.

లత భుజం మీద చేయి వేసినప్పుడల్లా ఆమె శరీరం కుంచించుక పోతున్నది.

అటువేపు ఐస్‌క్రీం బండి వచ్చింది.

నలుగురికి నాలుగు ఐస్‌క్రీంలు ఇప్పించింది లత. రాబోయే స్టూడెంట్స్ యూనియన్ ఎలక్షన్లలో ఆమె జనరల్ సెక్రటరీ పదవికి పోటీచేస్తున్నదని మరో సారి ఇక్కడ చెప్పకోవాలి.

కమల చేతిలోని ఐస్‌క్రీమ్ తాను తీసుకొని తన చేతిలోని ఐస్‌క్రీం కమల కిచ్చింది వినతి.

తన దెంత విశాల హృదయమో గమనిస్తున్నారా అన్నట్టు మిత్రులవంక చూస్తూ ఆ ఐస్‌క్రీం తినసాగింది వినతి.

వినతి చూపులను అర్థం చేసుకున్న కమలకు తాను తింటున్న ఐస్‌క్రీం చేదుగా వుంది.

కడుపులో మంట దిగుతున్నట్లుగా వుంది.

♦ ♦ ♦

రోజూ కలుసుకోగానే వినతి, లత 'హలో' అని విష్ చేసేవారు.

మరునాటినుంచి ఆ తరహా మారింది.

కమల కనిపించగానే 'హలో' అని కరచాలనం చేస్తున్నది వినతి. కరచాలనం చేసి ఊర్కోడంకాదు చాలామంది ఫ్రెండ్స్ చూసేదాకా చేయి వదలక అలాగే పట్టుకుంటున్నది.

ఆ ప్రత్యేకత కమలకు భరించరానిదిగా వుంది.

♦ ♦ ♦

ఒకరోజు సాయంకాలం, కాలేజ్‌నుంచి బస్ స్టాప్‌కు ఒంటరిగా నడిచి వస్తోంది కమల.

వెనక తన క్లాస్‌మేట్ జీవన్ ఎవరితోనో మాట్లాడుతూ వస్తున్నాడు.

కమల గబగబా బస్‌స్టాప్‌వైపు నడుస్తోంది.

వెనకనుంచి జీవన్ మాటలు వినిపిస్తున్నాయి.

ఎంత ట్రై చేసినా మా సిస్టర్‌కు ఎం.బి.బి.యస్‌లో సీటు రాలేదు బాస్. ఏ ఎస్సీనో, ఎస్టీనో అయితే బాగుండేది. సీట్ దొరికేది. అసలు ఎస్సీ అంటే ఏమిటో తెలుసా బాస్. సుప్రీం కాస్ట్, కాలేజీల్లో రిజర్వేషన్లు. ఉద్యోగాల్లో రిజర్వేషన్లు- స్కాలర్‌షిప్‌లు....ఉచిత విద్య....ఉచితంగా హాస్టల్లు....ఓహ్ లైఫంటే వాళ్ళది బాస్....పుడితే ఎస్సీగా పుట్టాలిగానీ ఫార్వర్డ్ కాస్ట్‌లో పుట్టగూడదు బాస్....బాస్టర్డ్ మనల్ని బతుకనీయరు బాస్.

ఆ మాటలు శూలాల్లా కమల గుండెలో గుచ్చుకున్నాయి. దగ్గరలోనేవున్న బస్‌స్టాప్ ఆమెకు ఎన్నో మైళ్ళ దూరాన ఉన్నట్టు అనిపించింది.

• • •

ఒకరోజు ఇంగ్లీషు మేడం క్లాసు తీసుకుంటున్నది. ఎవరో ఒక వ్యక్తి వచ్చాడు. ప్రిన్సిపాల్‌గారి అనుమతితోనే తాను క్లాసులోకి వచ్చానని మేడంకు పర్మిషన్ లెటర్ చూపించి తాను ఆ ప్రాంతం ఎం.ఎల్.ఏ. మోహన్‌దాసుగారి మనిషినని ఆ క్లాసులోని హరిజన బాలబాలికలకు ఉచితంగా టెక్ట్స్ పుస్తకాలు ఇచ్చి పోవడానికి వచ్చానని చెప్పాడు.

"ఎస్‌సి., ఎస్‌టి స్టూడెంట్స్ లేచి నిల్చోండి" అంది ఇంగ్లీషు మేడం.

ఆ కాలేజీలో ఎస్‌సి; ఎస్‌టి. స్టూడెంట్స్ చాలా తక్కువమంది వున్నారు: బి కాం. తెలుగు ఫస్టియర్ క్లాసులో కమల మాత్రమే ఎస్‌సి. స్టూడెంట్.

క్లాసులో కొందరి చూపులు కమలమీద నిలిచాయి. అలా తనను చూస్తున్నారని తెలిసి కమల వంచిన తల ఎత్తలేకపోయింది. లేచి నిల్చోలేకపోయింది.

"ఎవరూ లేరా?" అని అడిగింది మేడం ఇంగ్లీషులో.

ఆ పెద్దమనిషి త్వరగా వెళ్ళిపోతే బాగుండు అనుకుంటున్నది కమల.

మోచేత్తో కమలను పొడుస్తూ– "కమల ఉంది మేడం...." అంది వినతి.

"కమల స్టాండ్ అప్...."

లేవక తప్పిందికాదు.

అందరూ తనవంక చూస్తుంటే లేచి దోషిలా తల వంచుకుని నిల్చుంది కమల.

తాను మొదట నిల్చోమనగానే నిల్చోనందుకు కమలను ఇంగ్లీషులో పది నిమిషాలసేపు ఫాస్ట్‌గా తిట్టింది మేడం. ఉచితంగా పుస్తకాలిస్తుంటే తీసుకోవడానికి యింత బెంపరా? అని మరో అయిదు నిముషాలసేపు కోప్పడింది కాదు తిట్టింది ఇంగ్లీషులోనే–'ఇంగ్లీషు భాష'లో ఆమెకు పి.హెచ్.డి. ఉంది మరి!

• • •

ఒక సెకండ్ సాటర్‌డే. సండే కలిపి కాలేజీనుంచి రెండు రోజుల ఎన్.ఎస్ ఎస్. క్యాంప్ వేశారు. ఈసారి ఆ క్యాంప్‌లో పాల్గొనేది బి.కాం. ఫస్టియర్ తెలుగు మీడియం స్టూడెంట్స్ మాత్రమే.

ఒక పల్లెటూరిలో ఆ క్యాంప్ నిర్ణయించబడింది. హరిజనవాడలో రోడ్డు వేయటం, మొక్కలు నాటటంలాంటి కార్యక్రమా లున్నాయని గొప్పగా చెప్పుకుంటున్నారు విద్యార్థులు.

కమల పేరివ్వలేదని తెలిసి– "నువు క్యాంప్‌కు రావడం లేదా?" అని అడిగింది వినతి.

"ఉహూఁ...." అంది కమల.

"మన క్లాసుమేట్స్ చాలామంది వస్తున్నారుకదా- నువ్వుకూడా వస్తే బాగుంటుంది- సరదాగా రెండు రోజులు గడిపి రావచ్చు."

"మనం పనిచేయబోయేది మీ హరిజనవాడలోనేనట...." అంది జానకి.

అంతలో ప్యూన్‌వచ్చి చెప్పాడు. సర్వేశ్వరరావుగారు కమలను పిలుస్తున్నారని-స్టాఫ్ రూంలో ఉన్నారని.

సర్వేశ్వరరావుగారు ఎకనామిక్స్ లెక్చరర్. ఆయనే ఎన్. ఎస్. ఎస్. ప్రోగ్రాం ఆఫీసరు.

"కమల వెళ్ళగానే"....

"ఏమమ్మా నువ్వు క్యాంప్‌కు రావడంలేదా?—" అని అడిగారు.

"లేదు సార్...." అంది కమల.

"సాటర్‌డే మార్నింగ్ పోయి సండే ఈవినింగ్‌కల్లా వచ్చేస్తాం కదా...."

కమల మౌనంగా కుర్చీ కాలునుచూస్తూ నిల్చుంది.

"నీ పేరు కూడా ఇంక్లూడ్ చేస్తున్నా—"

"ఒద్దండి...."

"ఎందుకొద్దు....మన క్యాంప్‌లో ఒక్క హరిజన స్టూడెంటైనా లేకపోతే ఎలా....క్యాస్ట్‌వైజ్ పార్టిసిపెంట్ లిస్ట్ పంపించాలని మాకు ఆర్డర్స్ వచ్చాయి. షెడ్యూల్‌కాస్ట్ వాళ్ళుకూడా ఉన్నారని చూపిస్తే మనకు ఫండ్స్ తొందరగా వస్తాయి. అదిగాక హరిజన స్టూడెంటుతో మన క్యాంప్‌లో ఒక ప్రోగ్రాం ఉంది కదా—క్లాసులో వున్న ఒక్క హరిజన స్టూడెంట్‌వి నువ్వు రాకపోతే ఎలా?"

హరిజన స్టూడెంట్—హరిజన స్టూడెంట్—హరిజన స్టూడెంట్—కమల హరిజన స్టూడెంట్—కమల హరిజన స్టూడెంట్—ఇది కొత్తరకం వెలి—భయంకరమైన వెలి—

కమల మనసు క్షోభిస్తోంది—మూగగా రోదిస్తోంది.

"నీ పేరు ఇంక్లూడ్ చేస్తున్నాను. నువ్వు తప్పక క్యాంప్‌కు రావాల్సిందే —రాకపోతే నీ మీద యాక్షన్ తీసుకోవాల్సి వస్తుంది—" అని ఇక నువ్వు వెళ్ళొచ్చు అన్నట్టు చూశారు.

* * *

క్యాంప్‌లో శనివారం నాటి పనులు పూర్తయ్యాక ఆ రోజు రాత్రి మరునాటి కార్యక్రమాల గూర్చి సర్వేశ్వరావుగారు విద్యార్థులకు చెప్పారు—

మరునాడు ఉదయం మన క్యాంప్ కార్యక్రమాల్లో ముఖ్యమైన కార్యక్రమం ఒకటి ఉందన్నారు. అందుకోసం ప్రత్యేకంగా తన పలుకుబడినంతా వినియోగించి పత్రికా విలేఖరులను, రేడియో, టి.వి. ప్రతినిధులను రప్పిస్తున్నట్లు చెప్పారు. మన ఫోటోలు పత్రికల్లో పడతాయన్నారు. ప్రాంతీయ వార్తల్లో మన క్యాంప్ గూర్చి చెబుతారన్నారు. టి.వి. లో మన ప్రోగ్రాం చూపిస్తారన్నారు.

రేడియో. టి.వి. అనగానే ఆ రేపేదో వెంటనే వచ్చేస్తే బాగుండునని చాలా మందికి పుబలాటం కలిగింది. ఇస్త్రీ నలగని తమ తమ దుస్తులు సూట్ కేసుల్లో భద్రంగా ఉన్నాయో లేదో చూసుకున్నారు.

రేపు రావడానికి ఇంకా ఎన్ని గంటలుందని లెక్క-వేసే వాళ్ళు వేస్తున్నారు.

రోజుకు 24 గంటలుండటం అన్యాయమని కొందరు తీర్మానిస్తున్నారు.

ఇంతకూ మరునాడు ఆ కార్యక్రమం ఏమిటని కొందరు అడుగుతున్నారు.

"మన క్యాంప్‌లోని హరిజన స్టూడెంట్ కమల ఆలయ ప్రవేశం" అన్నారు ఆవేశంగా సర్వేశ్వరరావుగారు.

చప్పట్లు మిన్నుముట్టాయి. ఉత్సాహంతో కొందరు ఈలలు వేశారు. అలాంటి అభ్యుదయ కార్యక్రమంలో పాల్గొంటున్నందుకు ఆనందంగా ఉందని మరోసారి చప్పట్లు కొట్టారు.

పత్రికల్లో, టి.వి. లో ఫొటోలను గుర్తుకు తెచ్చుకుంటూ చాలామంది ఆ రాత్రి నిద్రపోలేదు. తమ తమ పోజ్‌ల గూర్చి ఊహించుకోసాగారు.

కమలకు అక్కణ్నుంచి పారిపోవాలని ఉంది. ఆ రేపు రావద్దని వుంది. ఆమె కళ్ళముందు జనం — ఫొటోగ్రాఫర్లు—కనిపిస్తున్నారు. తనను హరిజన బాలికని వేలెత్తి చూపుతున్నారు.— కమల భారంగా కళ్ళుమూసుకుంది.

ఎవరో బాధ పడతారని రేపు రాకుండా మానుతుందా?

రేపు రానే వచ్చింది.

ఉదయమే కమలచేత తలంటి స్నానం చేయించారు. కొత్తబట్టలు కట్టించారు. మెడలో పూలదండ వేశారు.

కమలను బలిపశువును చేశారు.

ఆలయం వైపు ఆమెను తీసుకుపోతున్నారు.

బాధనంతా రెప్పల మాటున దాచుకుని కమల నడుస్తున్నది.

ఆమె పక్కన నిల్చోడానికి ఒకరి నొకరు తోసుకుంటూ క్లాస్‌మేట్స్ పోటీ పడుతున్నారు. కెమెరాలకు ఫోజులిస్తున్నారు.

వినతి కమల చేయి విడవడంలేదు. లత తానే కమలను ఆలయ ప్రవేశం చేయిస్తున్నట్లు ఆమె ముందునుంచి కదలడంలేదు.

కెమెరాలు కమలవైపు తలలు తిప్పగానే మరింత దగ్గరగా ఆమెను ఆనుకొని నిల్చుంటున్నారు. ఎప్పుడూ ఆమెతో మాట్లాడని పారిజాతం కూడా నవ్వుతూ పలకరించి కమల పక్కన నిల్చుంటున్నది. టి వి లో తాను అందంగా కనపడాలని కాలోలు పట్టుచీర కట్టుకుంది.

ఈ అమ్మాయి పేరేమిటని ఎవరో అడుగుతున్నారు. కమల అని పోటీపడి జవాబు చెబుతున్నారు. జవాబు చెప్పే వాళ్ళ పేర్లు కూడా నోట్ చేసుకొని పత్రికల్లో వేస్తారేమోనని ఆశగా చూస్తున్నారు.

దారి పొడుగునా జనం గుమిగూడుతున్నారు.

"ఏందిగా పిల్లకు దండలేసి తీస్కపోతాండ్లు?...." అని అడుగుతున్నారు.

"ఆ అమ్మాయి హరిజన బాలిక ఆలయ ప్రవేశం చేయిస్తున్నారు...."

"ఆ పిల్ల మాదిగోల్ల పిల్లంట— గుళ్ళెకు తోలుకపోతాండ్లట "

"ఈ అమ్మాయేనా హరిజన స్టూడెంట్....ఏది ఒక స్నాప్....జస్ట్ స్మైల్ ఒకే...."

"దేవాలయంవైపు అడుగులు వేస్తుంటే మీ కెలావుంది.... ఐ మీన్ హౌ డు యు ఫీల్ ..." రేడియో, టి.వి. వాళ్ళ ప్రశ్నలవి.

టి.వి. అనగానే తోసుకుంటూ తనమీదికి వస్తున్నారు..... లాగి లాగి తన చేతులందుకుంటున్నారు.

"మాదిగ దానికి ఏం వైభోగం పట్టిందిరా ... పుట్టుకంటె దీంది బాస్...."

"దీన్ని ఉంచుకోరా....నీకూ పడ్తుంది వైభోగం...."

ఆ మాటలు ఈటెలై కమల గుండెను పెకిలించాయి.

చివ్వున ఆవేదన కళ్ళకు చిమ్మింది.

అవి ఆనంద బాష్పాలని రేడియో, టి.వి. వాళ్ళు రాసుకున్నారు.

* * *

క్యాంప్ నుంచి వచ్చిన కమల తండ్రి ఒడిలో తల పెట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చింది....

"ఏంది బిడ్డా.... ఏందే...." ఆదుర్దాగా అడిగాడు తండ్రి.

"నాన్నా మనం ఎక్కడికైనా దూరంగా పారిపోదాం నాన్నా.... మనల్ని మనుషులుగా చూసే చోటికి పారిపోదాం నాన్నా" తండ్రి ఒడిని చుట్టేసి దీనంగా విలపిస్తూ అంది కమల ...

[ఆంధ్రభూమి మంత్లీ, నవంబరు, 1982]